# పండగొచ్చింది

**బాబ్జీ**కి పన్నెండేళ్ళొచ్చాయి.

పన్నెండేళ్ళ బాబ్జీ చూడ్డానికి పదిహేనేళ్ళవాడిలా వుంటాడు. మిగలపండిన జాంపండులా వుంటాడు. అందుకేనేమో, అతన్ని ఇంట్లో తల్లిదండ్రులూ, నౌకర్లూ చాకర్లూ "పండుబాబూ!" అని పిలుస్తారు.

బాబ్జీ పిలిస్తే పలకడానికి పదిమంది నౌకర్లు ఎప్పుడూ సిద్ధంగా వుంటారు. అతను కాలుకింద పెడితే కందిపోకుండా, కమిలిపోకుండా ఇల్లంతా మెత్తటి తివాచీలు పరిచివుంటాయి. ఆకలేస్తే తినడానికి, ఆకలి వెయ్యకపోయినా తినడానికీ వెయ్యిరకాల తినుబండారాలింటినిండా వుంటాయి.

బాబ్జీకి అసలు ఆకలంటే ఏమిటో తెలీదు. బాబ్జీ తండ్రి పేరు రాజారావ్. రాజారావ్ పేరు తెలీనివాళ్ళు ఆ సిటీలో ఎవరూ లేరు. రాజారావ్‌ని మించిన ధనవంతులు ఆ సిటీలో ఒకరిద్దరికన్నా లేరు.

రాజారావ్‌కి చాలా పెద్ద ప్రాపర్టీ ఉంది. సీలింగు లేకుండా పెరిగిన ప్రాపర్టీ లాంటి బొజ్జ వుంది. బొజ్జ కరగడానికి చాలాకాలంగా మందులు తింటున్నా బొజ్జ పెరిగిందేగాని తరగలేదు. అతని బొజ్జ వల్ల అధమ పక్షం అరడజనుమంది డాక్టర్ల ఆదాయం పెరిగింది. అంచేత రాజారావ్ బొజ్జంటే చాలామందికి గౌరవం కూడా వుంది. బొజ్జ పెరిగినకొద్దీ రాజారావ్‌కి తన బొజ్జ మీద ప్రేమ పెరిగింది. దరిమిలా గర్వం కూడా కలిగింది. "ఇంత పెద్ద బొజ్జ, ఇంత అందమైన బొజ్జ ఎవడికుంది గనక?" అని తనలో తాను మురిసిపోతుంటాడు.

ఆ రోజూ అలాగే – డ్రాయింగ్‌రూమ్‌లో అరమైలు వెడల్పున్న సోఫాలో అరమోడ్పు కన్నులతో, బొజ్జ తడుముకుని మురిసిపోతూ కూర్చున్న రాజారావ్ దగ్గరకొచ్చి ముద్దు ముద్దుగా – "నాకో చాకొలేట్ కొనిపెట్టవా?" అన్నంత ముద్దుగా, తేలిగ్గా "నాకో కొత్త కారు కొనిపెట్టవా నాన్నా?" అని అడిగాడు బాబ్జీ.

రాజారావ్‌కి కొడుకు మీద కోపం వచ్చింది – విమానం కొనిపెట్టమని అడగనందుకు. ఆ తరువాత ఆశ్చర్యం వేసింది. విమానం లాంటి కార్లు ఇప్పటికే రెండు వుండగా మళ్ళీ కొత్త కారు ఎందుకడిగాడా అని. ఆ మాటే కొడుకు నడిగాడు.

"మన కార్లు పాతవైపోయాయి నాన్నా. మా స్కూలుకెళ్ళొచ్చే రోడ్డు పాడై పోయింది. ఆ గతుకుల్లో మన కారు అంత సుఖంగా నడవడం లేదు" అన్నాడు బాబ్జీ.

రాజారావ్‌కి ఆ నగరపాలక సంస్థ మీద కోపమొచ్చింది. తన కొడుకు స్కూల్‌కి వెళ్ళే రోడ్డు అంత ఛండాలంగా వున్నందుకు.

ఆ తర్వాత భారతదేశం మీద కోపమొచ్చింది. "ఛీ! వెధవ కంట్రీ! మంచి కార్లే దొరికి చావవు!" అని తిట్టుకున్నాడు.

"ఓకే మై సన్! ఐ విల్ గెట్ యూ ది బెస్ట్ కార్ ఎవైలబుల్ ఇన్ ది కంట్రీ. డోంట్ వర్రీ!" అని కొడుక్కి హామీ ఇచ్చాడు.

బాబ్జీకి పన్నెండేళ్ళొచ్చాయి. అతనికి ఏడాదికి కనీసం పన్నెండుసార్లైనా పుట్టిన్రోజు పండగలు జరుగుతాయి. అతని లేటెస్ట్ పుట్టిన్రోజు పండగనాడు దేశమంతటిలోకీ బెస్టు కారు, లేటెస్ట్ మోడల్ కారు కొని కొడుక్కి ప్రెజెంటేషన్‌గా ఇచ్చాడు రాజారావ్.

★ ★ ★

బుచ్చిబాబుకి ఆరేళ్ళొచ్చాయి.

ఆరేళ్ల బుచ్చిబాబు చూడ్డానికి ఆరేళ్లవాడిలాగే వుంటాడు.

బుచ్చిబాబు తండ్రి సుబ్బారావ్‌కి గుమాస్తాగా పదేళ్ళ సర్వీసుంది. పదేళ్ల నుంచీ పెరిగిన సుబ్బారావ్ జీతం, నెలలో ఇరవై రోజులకి మాత్రమే సరిపోయేటట్టుగా పెరిగింది. ఇరవయ్యొకటోరోజు నుంచీ సుబ్బారావు అప్పులూ, తప్పులూ చెయ్యడం మొదలెడ్తాడు.

సుబ్బారావ్ చేసిన తప్పులకి ఫలితంగా అతనికి ఒక పెళ్ళామూ, బుచ్చిబాబు కాక మరో ముగ్గురు బాబులూ, ఇద్దరు కూతుళ్ళూ వున్నారు.

సుబ్బారావ్ పెళ్ళానికి ఉబ్బసమో, క్షయో తెలీని జబ్బుంది. ఆ జబ్బు పూర్తిగా నయం చేయించడానికి డబ్బు లేక, ఇన్‌స్టాల్‌మెంట్ పద్ధతి మీద డబ్బిస్తాను, నయం చెయ్యమని చాలామంది డాక్టర్లని అడిగాడు సుబ్బారావ్. అలా వీల్లేదు పొమ్మన్నారు

డాక్టర్లు. అంచేత పత్రికల్లో ప్రకటించబడే "గ్యారంటీ చికిత్స" తాలూకు మందులు చవగ్గా కొని తనే పెళ్ళానికి వైద్యం చేస్తూ వుంటాడు.

తన అప్పులూ, తప్పులూ, పెళ్ళాం జబ్బూ, ఆఫీసులో మేనేజరూ, జీతమూ, రొటీన్ జీవితమూ ఇవన్నీ గంటకి యాభైసార్లు గుర్తొచ్చి – వందసార్లు "ఛీ! ఛీ!" అనుకుంటూ వుంటాడు సుబ్బారావ్. ఆ వేళ అవేమీ గుర్తురాని ఒక సుముహూర్తాన – అతని ఆరేళ్ళ సుపుత్రుడు బుచ్చిబాబు అతని దగ్గరకొచ్చి – ముద్దు ముద్దుగా "నాన్నా! నాకో మూడు చక్రాల సైకిల్ కొనిపెట్టవూ?" అని అడిగాడు.

సుబ్బారావ్‌కి కొడుకుమీద కోపమొచ్చింది. సైకిల్ బొమ్మ అడక్కుండా సైకిల్ అడిగినందుకు, మరుక్షణంలో తనమీదా, తన జీవితం మీదా కోపమొచ్చింది.

"ఛీ! ఛీ!" అనుకున్నాడు తనలో తాను. పైకి మాత్రం "చూద్దాంలే నాన్నా! కొనిపెడతాలే..." అన్నాడు. తన మాట అబద్ధమో, నిజమో తనకే నమ్మకం లేనట్టుగా.

సుబ్బారావ్‌కి తన మీద తనకే చాలాసార్లు నమ్మకం పోతూ వుంటుంది. కాని బుచ్చిబాబు పిల్లలందర్లోకీ తన ముద్దుల కొడుకు. బుచ్చిబాబు లోగడ చాలాసార్లు చాలా కోరికలు కోరాడు. కానీ అవేమీ తను తీర్చలేకపోయాడు. ఈ సారైనా కొడుకు కోరిక తీర్చాలనుకున్నాడు. ఈ మాత్రం చెయ్యలేకపోతే ఇంకా నా బతుకెందుకనుకున్నాడు.

అందుకే – అడ్డమైనవాళ్ళకాళ్ళూ పట్టుకుంటూ పెళ్ళానికి మందులూ, తనకి సిగరెట్లూ కొనడం మానేసి, ఇంకా చాలా ఖర్చులున్న సంగతి బలవంతాన మర్చిపోయి, ఎలాగైతేనేం ఒక యాభై రూపాయలు సేకరించి, బుచ్చిబాబుకి మూడు చక్రాల సైకిల్ కొనిపెట్టాడు.

★ ★ ★

పోలిగాడికి మూడేళ్ళొచ్చాయి. మూడేళ్ళ పోలిగాడు చూడ్డానికి ఏడాదివాడిలా వుంటాడు. ప్రాణం వుండీ లేనట్టుగా వుంటాడు. చూడ్డానికసహ్యంగా ఉంటాడు.

పోలిగాడి తండ్రి నారిగాడికి ముప్ఫయేళ్ళే అయినా చూడ్డానికి అరవయ్యేళ్ళవాడిలా ఉంటాడు. అరవై టన్నుల బరువు మోస్తున్నవాడిలా ఉంటాడు. దీనంగా దిగులుగా ఉంటాడు. బతికున్న శవానికి మల్లే ఉంటాడు.

నారిగాడి పెళ్ళాం రంగమ్మ బతకలేక చాలాసార్లు చచ్చిపోదామనుకుంది. కాని చావలేక ఇంకా బతికే వుంది.

నారిగాడికి పెళ్ళామూ పిల్లల్తో పాటు ఒక గుడిసె కూడా వుంది. ఆ గుడిసెలో మనుషులుంటారంటే చాలామంది నమ్మరు.

నారిగాడూ, రంగమ్మ కూడా దొరికితే కూలిపని చేస్తారు. కాని కూలి దొరకదు. కూలి దొరికితే, చేసిన కూలిపనికి సరిపడా డబ్బులు దొరకవు.

ఆ రోజు కూలి వెతుక్కుంటూ నారిగాడు వెళ్ళాడు. ఎక్కడికీ వెళ్ళే ఓపిక లేక రంగమ్మ గుడిసెలో వో మూల చతికిలబడి కూర్చుంది. నేలమీద దుమ్ములో పొర్లాడుతున్న మూడేళ్ళ పోలిగాడు మెల్లగా బితుకు బితుగ్గా "అమ్మా ! బువ్వెట్టవా?" అని అడిగాడు.

రంగమ్మకి కొడుకుమీద కోపం వచ్చింది- మంచినీళ్ళడక్కుండా బువ్వడిగినందుకు. కొడుక్కి ఏమీ సమాధానం చెప్పలేదు.

పోలిగాడు కాస్సేపాగి, తల్లి వంక చూసి - ఇంకా భయంభయంగా మళ్ళీ అడిగాడు - "అమ్మా! బువ్వెట్టవా?" అని.

రంగమ్మకి తన మీద తనకే కోపమొచ్చింది - కొడుకు బువ్వడిగితే పెట్టలేనందుకు.

ఏడుపొచ్చింది - పెట్టడానికి బువ్వలేనందుకు. ఏం మాట్లాడలేకపోయింది.

పోలిగాడు మరోసారి తల్లి వంక చూసి మరింత భయంగా, మరింత మెల్లగా, దీనంగా అడిగాడు "అమ్మా ! బువ్వెట్టవా?" అని.

రంగమ్మ చివాల్న లేచి "ఇందాకట్నించీ నా పానాలు తీత్తన్నావ్, బువ్వెట్టూ బువ్వెట్టూ అని. బువ్వెక్కడుందిరా సచ్చినాడా పెట్టడానికి?" అని కొడుకు వీపు మీద గట్టిగా ఒక చరుపు చరిచి, లోపల్నించి వెల్లువగా పొంగి వచ్చే ఏడుపును బలవంతాన ఆపుకుంటూ నేల మీద కూలబడింది.

★ ★ ★

భారతదేశంలో స్వాతంత్ర్యానికి పాతికేళ్ళ పండగొచ్చింది.

○

*(ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక: 3-11-1972)*

*(దేశానికి స్వాతంత్ర్యం వచ్చి పాతికేళ్ళు గడిచినందుకు ఉత్సవాలు జరుగుతున్న సందర్భంలో (1972) రాసిన కథ)*